క్లుప్తంగా

గాయత్రీదేవి అలంకరణలో శ్రీముత్యాలమ్మ

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మొదటి గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన వెంకట పిచ్చయ్య తదితర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



వత్సవాయి :కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గ్రామంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు రూ.5వేలను విరాళంగా వారికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, తమ్మినేని రమేష్, బొగ్గవరపు సీతారామారాజు, యశస్వి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల తొమ్మిది నుంచి 11వతేదీ వరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం నిర్వహణ, తడిపొడి చెత్తపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు గురువారం తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని సూచించారు.

ఆలయ పనుల పరిశీలన

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే పక్కన వేంచేసి ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి, శ్రీఅయ్యప్ప స్వామి ఆలయాల నిర్మాణ పనులను గురువారం దేవాదాయశాఖ స్థపతి సతీష్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీ మాట్లాడుతూ భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక 14వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు, బిస్కట్లు, గర్భిణులకు పండ్లతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణీల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీక్లబ్ జిల్లా ప్రతినిధి సోమేశ్వరరావు పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త మాసు రామారావు, కొత్తా పురుషోత్తం, పేరూరి నరసింహారావు, గెల్లా పూర్ణ, జి.ధనుంజయ, వసా నాగమణి, దారా సూర్యకళ, ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీకాంతమ్మ, అనంత లక్ష్మి, ఏఎన్ఎం విజయశాంతి, ఆశవర్కర్ కనక దుర్గ, స్కూల్ హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు వల్లి, శ్రీవిద్య పాల్గొన్నారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు



కంచికచర్ల : కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద గురువారం లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే కీసర గ్రామానికి చెందిన శ్రీనివాసరావు తన భార్యకు విజయవాడ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు ఇసుకకోసం వచ్చిన ఓలారీ, మరోలారీని తప్పించే క్రమంలో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్టాక్ పాయింట్ వద్ద రెండువరుసల్లో ఇసుకలారీలను నిలిపి ఉంచుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం ఏర్పడూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొనసాగుతున్న వరద



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద మునేరు ప్రవాహం



పులిచింతల నుంచి దిగువకు వస్తున్న వరద నీరు

జగ్గయ్యపేట: మండలంలోని కృష్ణానది పరివాహక గ్రామాలైన వేదాద్రి, ముక్త్యాల, రావిరాల ప్రాంతాలకు పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు చేరుతోంది. మూడోరోజు గురువారం పులిచింతల ప్రాజెక్టు నుంచి 11 గేట్ల ద్వారా 2.42 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికే పరివాహక ప్రాంత ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. అయితే గురువారం సాయంత్రం సమయంలో ఒక అడుగు మేర తగ్గిందని అధికారులు అంటున్నారు. వరద ప్రాంతాల్లో జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ ఆనంద్ పర్యటించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముక్త్యాల గ్రామంలో బూచవరం వైద్యాధికారి కీర్తిరెడ్డి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కీర్తిరెడ్డి మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా–కట్టలేరు..

వీరులపాడు:మండలంలోని దొడ్డదేవరపాడు, పల్లెంపల్లి గ్రామాల సమీపంలోని వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరద నీటి కారణంగా వరి, మొక్కజొన్న, పెసర పంటలు నీటమునిగి దర్శనమిస్తున్నాయి. రోడ్డుపైకి ఎక్కి ప్రవహిస్తుండటంతో తహసీల్దార్ రాజకిషోర్, ఎస్ఐ మహాలక్ష్మణుడు దొడ్డదేవరపాడు - నందిగామ మండలం దాములూరు గ్రామాలకు మధ్య రాకపోకలను అధికారులు నిలిపివేశారు. పల్లెంపల్లి, వీరులపాడు, దొడ్డదేవరపాడు, కొణతాలపల్లి గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలు వరద ముంపుకు గురవటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మునేరుకు భారీగా వరద నీరు..

పెనుగంచిప్రోలు: ఎగువ ప్రాంతాల్లో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాలకు మునేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం పెనుగంచిప్రోలు వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. మునేరుకు వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద నీటి మట్టం 9.7అడుగులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

165.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



కంచికచర్ల మండలం కీసర మున్నేటివద్ద వరద ఉధృతి



గొట్టుముక్కలలో నీటమునిగిన పత్తి చేను

కంచికచర్ల : ఎగువ ప్రాంతాలతోపాటు కంచికచర్ల మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా కీసర మున్నేటికి గురువారం భారీగా వరదనీరు చేరింది. గొట్టుముక్కల, కంచికచర్ల, పరిటాల, గండేపల్లి, పేరకలపాడు, మోగులూరు, పెండ్యాల తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలు నీట మునిగాయి. నందిగామ డివిజన్‌లో గురువారం 165.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కంచికచర్లలో 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, నందిగామలో 27.2, చందర్లపాడులో 17.6, వీరులపాడులో 26.0, జగ్గయ్యపేటలో 26.2, పెనుగంచిప్రోలులో 21.6, వత్సవాయిలో 26.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ఆయా పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ముక్త్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



వీరులపాడు-పల్లెంపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



వీరులపాడులో వైరా కట్టలేరు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీ



కీసర ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

కీసర(కంచికచర్ల): స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించబోమని నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు స్పష్టం చేశారు. మండలంలోని కీసర స్టాక్ పాయింట్‌ను గురువారం ఆయన పరిశీలించారు.రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో రవీంద్రరావు మాట్లాడుతూ ఒకే బిల్లుపై కొంతమంది రెండు, మూడుసార్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే స్టాక్ పాయింట్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.ఆర్డీవో వెంట వీఆర్వో హసీనాబేగం, కార్యదర్శి రాజు, సచివాలయ వ్యవసాయ సహాయకులు గోపి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అనుమంచిపల్లిలో...

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట):మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు పాయింట్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేష్‌బాబు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఉన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామ టౌన్: ఇసుక స్టాకు యార్డుల్లో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీవో విశ్వనాథ్ హెచ్చరించారు. మండలంలోని పల్లగిరి గ్రామ సమీపంలోని ఇసుక స్టాకు యార్డును గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ వేణుకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ



మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్

పరిటాల(కంచికచర్ల) : గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుత వాతావరణం కలిసిమెలసి ఉండాలని నందిగామ ఏసీపీ డాక్టర్ బి. రవికిరణ్ సూచించారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం ఆవరణలో గ్రామస్తులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎంఎంసీ ఎన్నికలు నందిగామ డివిజన్‌లో ప్రశాంతంగా ముగిశాయన్నారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు నిర్వహించినా, కవ్వింపు చర్యలకు పాల్పడి ఘర్షణలకు కారణమయ్యే వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నందిగామరూరల్ సర్కిల్ సీఐ పి.చంద్రశేఖర్, ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్య సూత్రం

జడ్జి శోభారాణి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్జి శోభారాణి

బూదవాడ(జగ్గయ్యపేట): వ్యక్తిగత పరిశుభ్రతే ప్రధాన ఆరోగ్య సూత్రమని జగ్గయ్యపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బూదవాడ సచివాలయంలో బూచవరం వైద్యాధికారులతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శోభారాణి మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, ఏజీపీ పిఎల్ నరసింహారావు, న్యాయవాదులు బూడిద నరసింహారావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, గాంధీ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జగ్గయ్యపేట డివిజన్ (జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలు) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రావూస్ హైస్కూల్‌లో జరిగిన అసోసియేషన్ డివిజన్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షునిగా షేక్ కాలేషా(రావూస్ హైస్కూల్), కార్యదర్శిగా చుంచు రమేష్(విజ్ఞాన్ స్కూల్, పెనుగంచిప్రోలు), కోశాధికారిగా పెంట్యాల బాలాజీ(రోజ్ స్కూల్, కంభంపాడు), ఉపాధ్యక్షుడుగా వల్లాపురపు వెంకటబాబు(జ్యోతిర్మయి స్కూల్, గౌరవరం), ఉపకార్యదర్శిగా బొల్లా సునీత రామారావు(శారద స్కూల్, మక్కపేట), కార్యవర్గ సభ్యులు వంకా యేసుబాబు(స్టార్ కిడ్స్ స్కూల్, షేర్‌మహ్మద్‌పేట), టొబీస్(సెయింట్ థామస్ స్కూల్, వత్సవాయి) ఉన్నారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్ గొల్లపూడి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు మల్లెల వెంకటశ్రీనివాసరావు, ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాసరావు, జిల్లా మహిళా చైర్‌పర్సన్ తన్నీరు సుధారాణి, శ్రీరాం బదరీనారాయణ, బొల్లా శ్రీనివాసరావు, వాసిరెడ్డి నరేంద్రదేవ్‌తోపాటు ఆయా పాఠశాలలకు చెందిన యజమానులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



వత్సవాయి పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో నాగరాజు



ధర్మవరప్పాడుతండాలో ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్న పేట ఎంఈవో-2 చిట్టిబాబు

జగ్గయ్యపేట: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 61పాఠశాలలుండగా 55పాఠశాలల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో-2 చిట్టిబాబు తెలిపారు. ఆరు పాఠశాలలకు సంబంధించి ఎన్నిక జరిగినట్లు ఆయన వివరించారు. గండ్రాయిలోని ఎంపీపీఎస్ పాఠశాల చైర్మన్‌గా నరేష్, వైస్‌చైర్మన్‌గా పుష్పలత, రావిరాల ఎంపీపీఎస్ పాఠశాల చైర్మన్, వైస్‌చైర్మన్లుగా సాగర్, ప్రసన్న, గండ్రాయి జెడ్పీ పాఠశాల చైర్‌పర్సన్లుగా తిరుపతమ్మ, సైదమ్మ ఎన్నికయ్యారు. జగ్గయ్యపేట జెడ్పీ బాలుర పాఠశాలకు చైర్‌పర్సన్‌గా అనురాధ, వైస్‌చైర్మన్‌గా సత్యనారాయణ, గురుకుల బాలికల పాఠశాల చైర్‌పర్సన్‌గా కళ్యాణి, వైస్‌చైర్మన్‌గా రమేష్, ఎస్టీ గురుకుల పాఠశాల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లుగా నాగమణి, నక్షత్ర చేతులెత్తే పద్ధతిలో ఎన్నికైనట్లు చిట్టిబాబు వివరించారు. అయితే జగ్గయ్యపేటతోపాటు షేర్‌మహ్మద్‌పేట, గౌరవరం, చిల్లకల్లు, అనుమంచిపల్లి, ధర్మవరప్పాడుతండ గ్రామాల్లోని ఎస్ఎంసీ ఎన్నికల్లో అధికారపార్టీ నాయకులు జోక్యం చేసుకోవడంపై విమర్శలు వినిపించాయి.

వత్సవాయి మండలంలో

వత్సవాయి : మండలంలోని 41పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చైర్మన్, వైస్‌చైర్మన్, కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారితో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రమాణం చేయించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని 37 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో పాల్ కెనడీ పేర్కొన్నారు. తాటిగుమ్మి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో వివరించారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో నిర్వహించి పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మల్లెపాక శ్రీనివాసరావు, వైస్‌చైర్‌పర్సన్‌గా రమావత్ నాగమల్లేశ్వరి, కమిటీ ప్రధాన సలహాదారుగా కత్తురోజు శ్రీనివాసాచారి, గద్దె రమేష్‌లతోపాటు సభ్యులు ఎన్నుకున్నారు. గోళ్లమూడి ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్‌గా కటారపు వెంకటేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్‌గా సురగాని ఉద్దండమ్మ, పెద్దవరం జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బింగి మాధవరం, వైస్ చైర్‌పర్సన్‌గా బాణావత్ లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని మోగులూరు ఎంపీపీ స్కూల్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకోగా, మినహా అన్ని పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 30పాఠశాలల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, 11 పాఠశాలల్లో చేతులెత్తే పద్ధతిలో కమిటీని ఎన్నుకున్నట్లు ఎంఈవో బాలాజీ తెలిపారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 33 పాఠశాలలు ఉండగా 29 పాఠశాలల కమిటీలు ఏకగ్రీవం కాగా, తోటచర్ల, ముచ్చింతాల యూపీ పాఠశాలలు, కొణకంచి, సుబ్బాయిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లను నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచి పద్మకుమారి, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు అభినందించారు.



కె.పొన్నవరం, శనగపాడు కమిటీలను అభినందిస్తున్న ఎంపీపీ గాంధీ తదితరులు



కంచికచర్ల ఎంపీపీ స్కూల్ మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీ

మున్సిపల్ ఆఫీసు ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నందిగామ టౌన్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు సక్రమంగా అందటం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులు గడుస్తున్నా పారిశుద్ధ్య సిబ్బందికి నేటికీ వేతనాలు అందించలేదన్నారు. సిబ్బందికి సంబంధించి మూడు ఖాతాలుండటంతో పీఎఫ్ నగదు ఏ ఖాతాలో జమవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందించటంతోపాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరి వెంకటేశ్వరరావు, సైదా, నరేష్, మాణిక్యం ప్రసాద్, నాగరాజు, రూతమ్మ, బేబి, పిచ్చయ్య, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, నిరుపేద మహిళలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈసందర్భంగా గురువారం కర్లపాటి పూజ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపకులు, సామాజిక వేత్త కర్లపాటి శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు భవిష్యత్‌లో కూడా కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.8వేల విలువైన ఆహార సామాగ్రిని అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో శ్రీదేవి, శ్రేయస్సు సంస్థ ప్రతినిధులు లక్ష్మీతిరుపతమ్మ, విజయకుమారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

100 క్వింటాళ్ల బియ్యం వితరణ



జగ్గయ్యపేట అర్బన్: కేరళలోని వరద బాధితుల సహాయార్థం జగ్గయ్యపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 100క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వారి నుంచి సేకరించిన బియ్యాన్ని కేరళకు పంపారు. ఈసందర్భంగా గురువారం లారీ ద్వారా కేరళకు బియ్యాన్ని పంపించే కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోదరుడు శ్రీరాం సాయిప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాఊపి ప్రారంభించారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చక్కా సుధాకర్, రామారావు, వంశీకృష్ణ, రాజబాబు పాల్గొన్నారు.